ముధోల్‌లో వరి కొనుగోలు కేంద్రం పరిశీలన

ముధోల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కే. శ్రీలత, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు తడిసిన ధాన్యంతో పాటు కొనుగోలు కేంద్ర పరిస్థితిపై సిబ్బంది వద్ద ఆరా తీరు. రైతులెవరూ అధైర్య పడవద్దని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నారాయణ పటేల్, సరస్వతీ, ఈవో అన్వర్, రైతులు ఉన్నారు.

తెరపైకి మళ్లీ పోడు లొల్లి



తర్లపాడ్ శివారులో పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు చేపట్టిన తవ్వకాలను అడ్డుకుంటున్న పోడు రైతులు (ఫైల్)

- జిల్లాలో పలుచోట్ల మూడు రోజులుగా ఉద్రిక్త వాతావరణం
- పోడు భూముల స్వాధీనానికి సిద్ధమవుతున్న అటవీశాఖ
- ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్నామంటూ తిరగబడుతున్న పోడు రైతులు
- ఇప్పటికే జిల్లాలో రెండు దఫాలుగా 35,080 ఎకరాల భూమికి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు
- నిజమైన లబ్ధిదారులకు నాడే పోడు పట్టాల పంపిణీ పూర్తి చేశామంటున్న అటవీశాఖ
- కొత్తగా 12696.78 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు లెక్కలు

ఖానాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మృగశిర ముందే వరుణుడి రాకతో అన్నదాత ఇక వానా కాలం పంటకు సన్నద్ధమవుతున్న వేళ తెరపైకి మళ్లీ పోడు భూముల లొల్లి వచ్చింది. దీంతో గత మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా ఏ మండలంలో చూసినా అటవీశాఖ అధికారులకు పోడు రైతులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. రోజురోజుకు ఈ ఘర్షణ వాతావరణం చినుకు చినుకు గాలివానలా మారుతోంది. జిల్లా వ్యాప్తంగా ఆక్రమణకు గురైన అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్ ఆదేశాలతో జిల్లాలో అటవీ అధికారులు క్షేత్రస్థాయిలో భూములను స్వాధీనం చేసుకోవడంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో తాము ఏళ్ల తరబడిగా వ్యవసాయం చేసుకుంటూ బతకడానికి ప్రధాన ఆధారంగా ఉన్న భూములను అటవీశాఖ అధికారులు తమ భూములంటూ స్వాధీనం చేసుకునేందుకు రావడంతో ఒక్కసారిగా పోడు రైతులు ఉలిక్కి పడుతున్నారు. ఈ భూములు తమవంటూ అటవీశాఖకారులకు అడ్డుపడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని అటవీశాఖ అధికారుల ఆరాటం ఒకవైపు తాము ఆధారపడి జీవిస్తున్న భూములను దక్కించుకోవాలని తమతమ వాదనలను వినిపిస్తున్నారు. ఇటు అటవీశాఖ గాని అటు పోడు రైతులు గాని పట్టు వదలకపోవడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. వాస్తవాలను నిర్ధారించి నిజమైన పోడు రైతులు ఎవరో ఇటీవల కాలంలో అడవులను నరుకుతూ ఆక్రమణకు పాల్పడిన వారెవరో నిర్ధారించి ఈ సమస్యను ఆదిలోనే పరిష్కరించకపోతే క్షేత్రస్థాయిలో ఇటు అటవీశాఖ అధికారులకు అటు పోడు రైతులకు మధ్య వివాదం మరింత ముదిరే పరిస్థితిలో ప్రమాదకరంగా తయారయ్యే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి వాస్తవాలను నిర్ధారించాలని పలువురు కోరుతున్నారు.

మూడు రోజులుగా ఘర్షణ వాతావరణం

పోడుభూముల స్వాధీనంకై అటవీశాఖ అధికారులు చేపట్టిన చర్యలతో జిల్లా అట్టుడుకుతోంది. జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ అటవీశాఖ అధికారులకు, పోడు రైతులకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంటోందని చెబుతున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఇదివరకే సాగులో ఉన్న పోడుభూములలో అటవీశాఖ అధికారులు కందకాలను తవ్వుతున్నారు. జేసీబీలను ఏర్పాటు చేసి కందకాలను యుద్ధ ప్రాతిపదికన తవ్విస్తుండడం పట్ల పోడు రైతులు మండి పడుతున్నారు. ఎక్కడికక్కడ కందకాల తవ్వకాన్ని అడ్డుకుంటూ కుటుంబాల సమేతంగా జేసీబీలకు అడ్డం పడుతూ కందకాల తవ్వకాన్ని ముందుకు సాగకుండా నిలువరిస్తున్నారు. ఒక దశలో అడ్డుకుంటున్న పోడు రైతులను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతుండడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారుతోంది.

జిల్లాలో 35,080 ఎకరాల భూమికి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు

2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబరుకు ముందు సాగులో ఉన్న గిరిజనులందరికీ రెండు దఫాలుగా పోడు పట్టాలను పంపిణీ చేసినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. 2008లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పోడు పట్టాల పంపిణీకి మార్గదర్శకాలు సిద్ధం చేసి 2009లో పోడు రైతులకు పట్టాలను మంజూరు చేసినట్లు చెబుతున్నారు. కాగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2023లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పోడు రైతులకు పట్టాల పంపిణీ చేసినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ రెండు దఫాలలో నిజమైన పోడు రైతులందరికీ పట్టాల పంపిణీ పూర్తయిందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా రెండు దఫాల్లో కలిసి 35,080 ఎకరాల పోడు భూములకు పట్టాలు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

12 వేల ఎకరాలకు పైగా అటవీ భూమి ఆక్రమణ

జిల్లావ్యాప్తంగా రెండు దఫాలుగా ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ పూర్తయిన తర్వాత కొంతమంది గిరిజనేతరులు సైతం తమకు పోడు పట్టాలు వస్తాయంటూ అటవీ భూములను ఆక్రమించడం ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబరు 13 నాటికి సాగులో ఉన్న గిరిజనులు అందరికీ పోడుపట్టాలు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా ఈ చట్టం ప్రకారం పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనేతరులు 75 ఏళ్లుగా తాము సాగులో ఉన్నట్లు రికార్డు చూపించాలని నిబంధన ఉన్నట్లు చెబుతున్నారు. చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం సాగులో ఉన్న వారికి ఇదివరకే పోడు పట్టాలు అందినట్లు చెబుతున్న అటవీశాఖ అధికారులు తాజాగా జిల్లాలో 12696.78 ఎకరాల అటవీ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. ఈ భూములను క్రమేపి స్వాధీనం చేసుకొని రానున్న వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు సన్నద్ధమవుతున్నారు.

సరైన అవగాహన కల్పించకపోతే పరిస్థితుల్లో మరింత ఉద్రిక్తం

పోడు భూములను సాగు విషయంలో ప్రస్తుతం నెలకొన్న వివాదాన్ని మరింత జటిలం కాకుండా ఉండాలంటే నేరుగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రంగప్రవేశం చేయాలని పలువురు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో 2006 అటవీహక్కుల చట్టం నిబంధనలను ఉల్లంఘించిన వారికి సరైన అవగాహన కల్పించి అటవీ భూములను సున్నితంగా స్వాధీనం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఓవైపు అటవీశాఖ మరోవైపు పోడు రైతులు భూమి తమదంటే తమదంటూ పట్టుదలకు పోయి పరిస్థితిని మరింత జటిలంగా మార్చకుండా పోడు భూముల వ్యవహారాన్ని సున్నితమైన అంశంగా భావించి ప్రస్తుతం సాగులో ఉన్న రైతులందరితో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. భూమిలేని నిజమైన నిరుపేదలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించి పోడు భూముల స్వాధీనంపై ముందుకు సాగాలని సూచిస్తున్నారు. ఏళ్ల తరబడిగా భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుని జీవనాన్ని కొనసాగిస్తున్న నిరుపేదలు ఉన్న పలంగా తమ జీవనాధారం పోతుందంటే దిక్కుతోచని స్థితిలో పడిపోతారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జటిలమైన సమస్యను సున్నితంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ పోడు రైతులకు జీవనాధారాన్ని కల్పించాలని పలువురు హితువు పలుకుతున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అటవీశాఖ అధికారుల మీదికి పోడు రైతులను ఉసిగొల్పేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం పట్ల అటవీ శాఖ అధికారులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ విధులను మాత్రమే తాము నిర్వహిస్తున్నామని కేవలం తమను మాత్రమే బూచి చూపే విధంగా కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సున్నితమైన సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని ఇటు అటవీశాఖ అధికారులతో పాటు అటు పోడు రైతులు, జిల్లా ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సాగు భూములు వదిలేది లేదు.. కొత్తగా అడవిని కొట్టేది లేదు

నందిరామయ్య, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి

జిల్లాలో ఏళ్ల తరబడిగా పోడు వ్యవసాయం సాగిస్తున్న భూములలో ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు కందకాలు తవ్వడం సరికాదు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా గిరిజనులతో పాటు పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనేతరులకు సైతం పట్టాలు మంజూరు చేయాలి. అటవీ అధికారులు ఎంత ఇబ్బంది పెట్టిన సాగు భూములను వదిలేది లేదు. అలాగని కొత్తగా అడవిని నరికేది లేదు. సున్నితమైన ఈ అంశాన్ని మరింత జటిలం చేయకుండా ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి పరిష్కరించాలి

ఆక్రమణకు గురైన అటవీభూముల స్వాధీనానికి సహకరించాలి

నాగిని భాను (డీఎఫ్‌వో, నిర్మల్)

జిల్లాలో ప్రస్తుతం 12696.78 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలో ఆక్రమణకు గురైన అటవీ భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. నిజమైన లబ్ధిదారులందరికీ రెండు రకాలుగా ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను మంజూరు చేశాం. మాకు కూడా పోడు పట్టాలొస్తాయని భావించి అడవులను నరికిన వారే ఇప్పుడు అటవీ భూములను ఆక్రమించుకున్నారు. ఈ భూమి తిరిగి అటవీ శాఖ స్వాధీనం చేసుకునేందుకు సహకరించాలి



చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

గోవుల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలి

● ఎస్పీ డా. జానకీ షర్మిల

నిర్మల్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : గోవుల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల అన్నారు. గురువారం జిల్లాలోని సోన్ మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద గల చెక్‌పోస్టును, కొండాపూర్ సెయింట్ థామస్ స్కూల్ వద్దగల చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేయటంతో పాటు చెక్‌పోస్టులో గల సిబ్బంది తగు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో గోవుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా సరిహద్దులో 07 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, 24/7 నిరంతర పర్యవేక్షణలో ఉండే విధంగా ప్రత్యేక చెక్‌పోస్టులలో పోలీస్, పశు సంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్ట్‌ల వారీగా సమన్వయంతో విధులు నిర్వహించడం జరుగుతుందని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగా గోవుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. గోవులను రవాణా చేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు. సరిహద్దు రాష్ట్రాల నుండి రవాణా అయ్యే గోవుల విషయంలోనూ నియమ, నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరైన పత్రాలు వారి వెంట ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి అనుమతించాలని, అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని తెలిపారు. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కఠినచర్యలు తీసుకునేందుకు జిల్లా ముఖ్య కార్యాలయంలో సోషల్ మీడియా సెల్ ప్రత్యేకంగా పరిశీలన చేస్తుంటారని తెలియజేశారు. అదే విధంగా మత పెద్దలతో శాంతిసమీక్ష సమావేశాలు నిర్వహించి, భద్రత పరంగా ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా, మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల ముందస్తుగా పటిష్టమైన పోలీస్ బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణా నియంత్రించేందుకు నిఘా విభాగం అప్రమత్తంగా ఉంటుందని, చెక్‌పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు జప్తు చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి మిల్లులకు తరలించాలి



ఐకేపీ సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ఎల్. కిషోర్ కుమార్

లక్ష్మణచాంద, మే 29 (ఆంధ్రజ్యోతి) : త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి రైస్ మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ ఎల్.కిషోర్‌కుమార్ మండల అధికారులను ఆదేశించారు. గురువారం పర్యటించారు. మండల కేంద్రంతో పాటు పలు కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కొనుగోళ్లు ఎంత వరకు పూర్తయిందన్న విషయంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఆర్ఐ నరేందర్ రెడ్డి, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలి

నిర్మల్ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల సమావేశాలు శుక్రవారం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెలలో ప్రతీ శుక్రవారం నిర్వహించవలసిన తల్లిదండ్రుల సమావేశాల్లో 4వ సమావేశాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నేడు (శుక్రవారం) తప్పక నిర్వహించాలన్నారు. 1వ, 6వ, 8వ తరగతిలోకి ప్రవేశించు విద్యార్థులను గుర్తించి, ఇవ్వబడిన స్ప్రెడ్ షీట్‌లో నమోదు చేయాలని తెలిపారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం

నిర్మల్ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మైసూర్ దత్తపీఠం నిర్వహించిన భగవద్గీత పఠన పోటీల్లో నిర్మల్ పట్టణం శాస్త్రినగర్‌కు చెందిన బాలుడు పవన్ చంద్ర బంగారు పతకం సాధించాడు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో గటిక శ్రీనివాస్ స్వామి, గీతల కుమారుడు భగవద్గీత 18 అధ్యాయాల్లోని శ్లోకాలను అలవోగా పఠించి బంగారు పతకాన్ని, సర్టిఫికెట్ అందుకున్నాడు. గణపతి సచ్చిదానంద స్వామి ద్వారా బంగారు పతకాన్ని అందుకున్న బాలుడిని పలువురు అభినందించారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రారంభిక్ వర్గ శిక్షణ

నిర్మల్ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రారంభిక్ వర్గ పేరుతో కొత్త వారికి శిక్షణ ఈ నెల 30 నుంచి జూన్ 1 వరకు నిర్వహిస్తున్నట్లు నగర సంచాలక్ డాక్టర్ తుమ్మల ప్రమోద్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విజయ హైస్కూల్‌లో నిర్వహించే శిక్షణలో పాల్గొనేవారు 9966763964, 9490095559 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఇంటర్ పూర్తి చేసిన వారు, ఉద్యోగ, వ్యాపారస్తులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చునని తెలిపారు.

'రాజీవ్ యువ వికాసం'ను పటిష్ఠంగా అమలు చేయాలి : కలెక్టర్

నిర్మల్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా రాజీవ్ యువ వికాసం పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రాజీవ్ యువ వికాసం పథకంపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా లబ్ధిదారుల జాబితాపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హులైన యువతను ఎంపిక చేసి, వారిని తగిన శిక్షణ కార్యక్రమాల ద్వారా అభివృద్ధి చేయాలన్నారు. ప్రతీశాఖ కూడా పరస్పర సమన్వయంతో పని చేసి ఈ పథకం ప్రయోజనాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున శాఖల వారీగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

నిర్మల్ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానించాలని, వేదికను అందంగా పూలతో ఆకర్షణీయంగా అలంకరించాలని ఆదేశించారు. ప్రోటోకాల్ అనుగుణంగా వేదికపై సీటింగ్ అరెంజిమెంట్ చేయాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని, దేశ శక్తి ప్రతిబింబించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, టెంట్లు, షామియానా, తాగునీరు, అల్పాహారం అందించేలా చూడాలన్నారు. పోలీస్, అగ్నిమాపకశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. రాజీవ్ యువశక్తి తదితర సంక్షేమ పథకాల పత్రాలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అవతరణ వేడుకలు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ఖానాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి తెలిపిన కథనం ప్రకారం... గురువారం టీజీ 18టీ 0045 అనే నెంబర్ గల ట్రాలీ ఆటోలో ఖానాపూర్‌కు చెందిన రఫెఖాన్ అనే కిరాణా వ్యాపారి దుకాణం నుంచి ఖానాపూర్‌కు చెందిన అబ్దుల్ అన్వర్, కరిపే రంజిత్ అనే ఇద్దరు వ్యక్తులు ఐదు క్వింటాళ్ల నల్ల బెల్లం, 20 కిలోల పటికను అక్రమంగా తరలిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు రహస్య సమాచారం అందింది. ఈ మేరకు ఎక్సైజ్ అధికారుల బృందం దాడులు నిర్వహించి వీరిని పట్టు కున్నట్లు ఇన్‌స్పెక్టర్ రంగస్వామి తెలిపారు. పట్టుకున్న నిందితులను విచారించగా రఫె ఖాన్ అనే వ్యాపారి వద్ద నల్ల బెల్లం, పటిక కొనుగోలు చేసి నాటు సారా తయారు చేసే వారికి అమ్ముతామని నిందితులు తెలిపి నట్లు ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు. కాగా ఈ కేసులో నల్లబెల్లం పటికను సరఫరా చేస్తున్న అబ్దుల్ అన్వర్, రంజిత్‌లతో పాటు వాటిని విక్రయించిన రఫెఖాన్‌పై సైతం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది వెంకటేష్, హరీష్, ఇర్ఫాన్, సాయన్న, రాజేందర్, తదితరులున్నట్లు పేర్కొన్నారు.

ముధోల్ ఎస్సైగా బిట్ల పెర్సెస్



ముధోల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ముధోల్ ఎస్సైగా బిట్ల పెర్సెస్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్సై సంజీవ్ నిర్మల్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. నిర్మల్ జిల్లా షీ టీం, భరోసా కేంద్ర ఎస్సైగా పని చేసిన బిట్ల పెర్సెస్ ముధోల్‌కు బదిలీపై వచ్చారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్సై తెలిపారు.

ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ బాధ్యతారాహిత్యంపై కలెక్టర్ ఆగ్రహం

- సీడీఎంఏకు సరెండర్ చేస్తూ ఉత్తర్వుల జారీ
- ఖానాపూర్ కమిషనర్‌గా నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు



ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌ను సరెండర్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి వెలువడ్డ ఉత్తర్వులు

ఖానాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణపై సరెండర్ వేటు పడింది. ఈ మేరకు ఈ నెల 28వ తేదీన సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖానా పూర్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన జాదవ్ కృష్ణ ఈ నెల 25వ తేదీన సాధారణ సెలవు కోసం 24వ తేదీన దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుతో 25వ తేదీన జాదవ్ కృష్ణకు సాధారణ సెలవును అధికారులు మంజూరు చేశారు. దీంతో ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు తనకు సెలవును పొడిగించాలని మెసెంజర్ ద్వారా అధికారులను కోరడంతో ఆయన విజ్ఞప్తిని జిల్లా అధికారులు తిరస్కరించారు. ప్రస్తుతం రాజీవ్ యువ వికాస్, ఇందిరమ్మ ఇళ్ల తదితర ప్రభుత్వ పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పనులు పెండింగ్‌లో ఉండడంతో 27వ తేదీన 24 గంటల్లోపు విధుల్లో హాజరు కావాలని సదరు కమిషనర్ కృష్ణకు అధికారులు సూచించారు. అయినా సదరు అధికారి కృష్ణ 28వ తేదీలోపు విధులకు హాజరు కాకపోవడాన్ని జిల్లా కలెక్టర్ తీవ్రంగా పరిగణించినట్లు చెబుతున్నారు. విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు గాను ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) తెలంగాణకు సరెండర్ చేస్తూ ఈ నెల 28వ తేదీన సాయంత్రం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్ గౌడ్‌కు ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

మానసిక ప్రశాంతతకు యోగా దోహదం



యోగాపై అవగాహన కల్పిస్తున్న ముండే ప్రీతి

ఇంద్రవెల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహద పడుతుందని ఆయుష్ డిస్పెన్సరీ ముండే ప్రీతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఆయుష్ కార్యక్రమంలో భాగంగా యోగాపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో శారీరకంగా, మానసికంగా మారులు రావడంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పూజిత, హెల్త్ సూపర్‌వైజర్ పవార్ సురేష్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'మాల మహార్ సంఘానికి న్యాయం చేయాలి'

తాంసి, మే 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల మహార్ సంఘానికి అన్ని విధాలుగా సహకారాలు అందించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొట్ట ప్రదీప్ కోరారు. గురువారం సాయంత్రం అంబేద్కర్ అనుచరుడైన దీనాబానా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కులస్తుల్లో చాలామంది నిరుపేదలేనని అన్నారు. ప్రభుత్వాలు స్పందించి తమ కులస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది విద్యావంతులు ఉన్నప్పటికీ వారికి న్యాయం జరగడం లేదని ఈ విషయంలో ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి రానున్న రోజుల్లో చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పాటిల్ సంతోష్, సంయుక్త కార్యదర్శి పాటిల్ లింబాద్రి, భగత్ విలాస్, భగత్ సోను, తదితరులు పాల్గొన్నారు.

నీలిగాయ్‌కి వైద్యం చేయించిన అధికారులు

బోథ్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటేగాం గ్రామం సమీపంలో నీలుగాయ్‌ని కుక్కలు ధర్మారంతో గాయాలపాలై గ్రామస్తులకు బుధవారం సాయంత్రం గ్రామస్తులు విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలిపారు. దీంతో అటవి శాఖ అధికారులు పశు వైద్య అధికారులను పిలిపించి నీలి గాయ్‌కి వైద్యం చేసి అడవిలో విడిచిపెట్టారు. ఈ విషయమై రేంజ్ అధికారి మాట్లాడుతూ అడవి జంతువులకు నష్టం కలిగించవద్దని వేటాడితే చర్యలు తప్పవు అన్నారు.

'ఆదర్శ పాఠశాల నిధుల విడుదలకు డబ్బుల డిమాండ్'

నేరడిగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావర్గం గ్రామ పంచాయతీ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలకు చెందిన అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల విడుదల కోసం డబ్బులు అడుగుతున్నారని జాదవ్ మహేందర్ ఆరోపించారు. 2023-2024 విద్యా సంవత్సరంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేశానన్నారు. కాగా స్థానిక అధికారులు డబ్బులు డిమాండ్ చేశారన్నారు. జిల్లా అధికారులు చొరవ తీసుకొని అధికారులపై చర్యలు తీసుకోవాలని మహేందర్ జాదవ్ కోరారు. ఈవిషయమై ఎంపీడీఓ రాజ్ వీర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అమ్మ ఆదర్శ పాఠశాల బిల్లు పంపామని కానీ బిల్లు మంజూరు కాలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



రోడ్డుప్రమాదంలో మృతిచెందిన యువకులు

ఆదిలాబాద్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన ఆకాశ్, కల్యాణ్ ద్విచక్ర వాహనంపై అదిలాబాద్ వైపు వెళ్తుండగా మావల సమీపంలో మూలమలుపు ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆకాశ్ అక్కడికక్కడే మృతి చెందగా కల్యాణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. దీంతో ఇరుకుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

గజ్జల రాజుల్ దేవతకు విత్తనపూజలు



గజ్జల రాజుల్ దేవతకు విత్తనపూజలు చేస్తున్న రైతులు

ఇంద్రవెల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ సమీపించడంతో మండలంలోని మారుమూల గ్రామాల ఆదివాసీ రైతులు గ్రామ, అటవీ దేవతలకు విత్తన పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని ఖైర్‌గూడ, పొల్లుగూడ గ్రామాల ఆదివాసీ రైతులు వాల్గొండ అటవీ ప్రాంతంలో ఉన్న గజ్జల రాజుల్ దేవతకు విత్తన పూజలు చేసి మొక్కుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పుష్కలంగా కురవాలని, సాగు చేసిన పంటలు బాగా పండాలని, అటవీ జంతుల నుంచి పంటలను రక్షించాలని గజ్జల రాజుల్ దేవతకు మొక్కినట్లు ఆ గ్రామాల ఆదివాసీ రైతులు తెలిపారు. ఈ కార్యకమంలో ఆదివాసీ పెద్దలు కోరెంగా లింగు, ఆత్రం శంకర్, జుగ్నాక్ కాశీరాం, జుగ్నాక్ భారత్, మర్సుకోల నాందేవ్, లింబారావు, సిడాం భుజంగ్‌రావు తదితరులు ఉన్నారు.

కొండ లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రభుత్వం గుర్తించాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

బోథ్, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు ఐదుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికై డిప్యూటీ స్పీకర్ మంత్రిగా సేవలందించిన కొండ లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని బోథ్ పద్మశాలి సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన మహానాయకుడు అన్నారు. ఆయనను ప్రభుత్వం గుర్తించి తెలంగాణ జాతిపితగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఆసాల సదాశివ్, గౌరవ అధ్యక్షులు గంగుల మల్లేష్ పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు మెరుగు భజన ప్రధాన కార్యదర్శి మాసం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నేరడిగొండలో గ్రోమోర్ సేవలు అభినందనీయం

● డీఏవో శ్రీధర్‌స్వామి



గ్రోమోర్ షాప్‌ను ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో

నేరడిగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రోమోర్ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఏవో శ్రీధర్ స్వామి అన్నారు. వివిధ రకాల విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, వివిధ రకాల వ్యవసాయ పరికరాలు, రైతులకు అందు బాటులో విక్రయించేందుకు నేరడిగొండలో కోరమాండల్ వారి మన గ్రోమోర్ కేంద్రాన్ని గురువారం వ్యవసాయ అధికారి డీఏవో శ్రీధర్ స్వామి ప్రారంభించారు. రైతులకు మరింతగా సేవలందించేందుకు మన గ్రోమోర్ కేందాన్ని ఏర్పాటు చేసినట్లు డీఏవో శ్రీధర్ స్వామి తెలి పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణవేణి, మన గ్రోమోర్ సెంటర్ ఏరియా మేనేజర్ రిటైల ఆపరేషన్స్ వీఎస్ స్వామి, ఏరియా కంట్రోలర్ నరేంద్ర, న్యూ స్టోర ఆపరేషన్స్ గోపి, గ్రోమోర్ సెంటర్ మేనేజర్ పాల్గొన్నారు.

వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

తలమడుగు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లి (బీ) గ్రామంలో గల శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షి కోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి గోవిందమ్మకు కన్నుల పండుగ కల్యాణం నిర్వ హించారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో గ్రామపెద్దలు నల్ల సుభాష్ రెడ్డి, లోక లింగారెడ్డి, కటకం శ్రీనివాస్, ఎల్మ భోజ రెడ్డి, విశ్వ బ్రాహ్మ ణులు శ్రీనివాస్, ప్రవీణ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

అంధ విద్యార్థి చదువుకు గ్రామస్తుల ఆర్థిక సహాయం

ఇంద్రవెల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన మస్కే నితేష్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నాడు. కళాశాల హాస్టల్ ఫీజుకు చెల్లించాల్సి ఉండగా. ఓ వైపు పేదరికం కావడంతో ఫీజు కట్టలేని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు దుర్వా సంతోష్(పోలీస్), జైస్వాల్ మనోజ్‌లు వెంటనే స్పందించి తమవంతు సహాయంగా 6 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని నితేష్‌కు అందజేసి, అండగా నిలిచారు. చదవాలనే ఆకాంక్ష ఉన్న ఈ విద్యార్థికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక చేయూతను అందించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో రంగుల రాజు, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు



మాట్లాడుతున్న సీఐ ఫణీందర్

తలమడుగు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు గ్రామానికి చెందిన కరుణాకర్ రెడ్డి అనే వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ ఫణిందర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాటాడుతూ మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన అమీరుద్దీన్ అనే వ్యక్తికి 50 సంవత్సరాల క్రితం ప్రభుత్వం 25 ఎకరాల భూమిని అసైన్మెంట్‌గా ఇవ్వడం జరిగిందన్నారు. అట్టి భూమిని కళ్లెం కరుణాకర్ రెడ్డి అమీనుద్దీన్ వారసుడిగా లతీఫుద్దీన్ అనే వ్యక్తిని సృష్టించాడన్నారు. అమీనుద్దీన్ పేరు మీద గల 25 ఎకరాల భూమిని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులను మేనేజ్ చేసి లతీఫుద్దీన్ పేరు మీదికి ఆర్‌వోఆర్ ద్వారా రెవెన్యూ రికార్డులలో పేరు మార్చాడన్నారు. తర్వాత అట్టి భూమిని రిజిస్ట్రేషన్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ ద్వారా కళ్లెం కరుణాకర్ రెడ్డి అతని పేరు మీదికి ల్యాండ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని చెప్పారు. దీనిపై భూమి వారసులు ఫిర్యాదు చేయడంతో తలమడుగు పోలీస్‌స్టేషన్‌లో కళ్లెం కరుణాకర్ రెడ్డి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బోథ్, మే 29 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ నూతన కమిటీ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షునిగా సురేష్, వైద్య ప్రధాన కార్యదర్శిగా భూస లక్ష్మణ్, కోశాధికారిగా కొట్టాల రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్కరాజు, వెల్మ సూర్య ప్రకాశ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మునీర్, హైమద్, రసం నవీన్, మాసం అనిల్ కుమార్‌లను ఎన్నుకోగా సలహాదారులుగా శ్రీనివాస్ రెడ్డి, రమేష్ బాబు, సురేందర్ యాదవ్, రవీంద్ర ప్రసాద్, ఆర్బివి ప్రసాద్, దివాకర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఎం.శివారెడ్డిలను ఎన్నుకున్నారు.

జొన్న పంట కొనుగోలు సమయాన్ని పెంచండి

బోథ్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న జొన్న పంట సమయం పెంచాలని బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షులు మేడి చల్మా ప్రవీణ్ ప్రభుత్వాన్ని కోరారు. అనేకమంది రైతుల పంటచేలాలోని జొన్న పంట ఉందని దీంతో పంట చేతికి వచ్చిన వర్షాల వల్ల మార్కెట్‌కు తేలేక పోయారన్నారు. ఈ నెల 30న సాయంత్రం వరకు పంట కొనుగోలు సమయాన్ని నిర్ణయించారని దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారం రోజులపాటు పంట కొనుగోలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా అధికారులు ఆలోచించి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం వారం రోజులపాటు కొనుగోలు సమయాన్ని పెంచినట్లయితే పూర్తి స్థాయిలో రైతాంగాన్ని ఆదుకున్నట్లు అవుతుందన్నారు. లేకుంటే రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని పేర్కొన్నారు.

పశువులకు సోకుతున్న లింపి స్కిన్ వైరస్

బోథ్, మే 29 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది పశువులకు సోకిన లింపి స్కిన్ వైరస్ మళ్లీ ఈ సంవత్సరం విజృంభిస్తుంది. ఫలితంగా పశువుల చర్మాలపై దద్దుర్లు వస్తున్నాయి. వ్యాధి నివారణ కోసం అధికారులు గ్రామాలలో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వ్యాధి నివారణ టీకాలు వేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. కాగా ఈ విషయమై పశువైద్యాధికారి ఏడీఏను ఈ విషయం వివరణ త్వరగా గ్రామాలలో వ్యాధి తీవ్రతను గుర్తించి వైద్య సేవలు కొనసాగిస్తామని అంతేగాక అవసరమైతే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఇంజక్షన్లు వేయడం జరుగుతుందన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు చేయండి

బోథ్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ మూడోవార్డులో ఉన్న సామూహిక మరుగుదొడ్లు నాసిరకంగా నిర్మించడం వల్ల పైకప్పు రేకులు విరిగిపోవడంతో పాటు తలుపులు సైతం విరిగిపోయాయని వాటిని మరమ్మతు చేయించాలని డి.ఎస్.పి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ పేర్కొన్నారు. వర్షాకాలంలో మరుగుదొడ్లను వినియోగించే విధంగా శుభ్రం చేయించినట్లయితే వినియోగంలోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. స్పందించిన ఈవో తక్షణమే మరమ్మతులు చేస్తామని వివరించారు.

రాళ్ల బోరిగాం గ్రామంలో తొలగించిన స్థానంలో

బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

● దీక్ష శిబిరం వద్ద బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్



దీక్షశిబిరం వద్ద మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్

భైంసా, మే 29 (ఆంధ్రజ్యోతి) : సమస్య తీవ్రతను సకాలంలో గుర్తించి పరిష్కరించడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందడం మూలంగానే నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రాళ్ళ బోరిగాం గ్రామంలో బుద్ధుని విగ్రహ తొలగింపు, దళితులపై దాడుల ఘటనలు చోటు చేసుకున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం భైంసాలో బుద్ధ- అంబేద్కర్స్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాళ్ల బోరిగాం గ్రామ ఘటన వ్యతిరేకిస్తూ నాలుగు రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించి సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ మాట్లాడుతూ రాళ్ల బోరిగాం గ్రామంలో అధికారులు దళితులపై వివక్షత దోరణిని ప్రదర్శిస్తూ ఏకపక్షంగా బుద్ధుని విగ్రహాన్ని తొలగించారని ఆరోపించారు. ఇదే క్రమంలో గ్రామ వీడీసీ శ్రేణులు రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి దళితులపై విచక్షణరహితంగా దాడులకు తెగబడ్డారని తెలిపారు. సంబంధిత విషయంలో దళితులు దాడులకు పాల్పడిన 40 మందిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారిపై కేసులు నమోదు కాలేదన్నారు. అధికార యంత్రాంగం అధికారంలోని వారికి వత్తాలు పలుకుతూ దళితుల పట్ల వివక్షతను కొనసాగించిందని దుయ్యబట్టారు. అధికార యంత్రాంగం ఇకనైనా తీరు మార్చుకొని తొలగించిన స్థానంలోనే బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో దళితుల ఫిర్యాదుకు అనుగుణంగా దాడులకు పాల్పడిన 40 మంది పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. ఇందులో బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్లు నిషాని రాంచంద్రం, దయానంద రావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుండెల ధర్మేందర్, జక్కుల వెంకట్, నగందుల వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి గ్యార జగన్, జోనల్ కోఆర్డినేటర్ జగన్ మోహన్‌లతో పాటు జిల్లా ప్రతినిదులు పాల్గొన్నారు.

30న ఛలో రాళ్ల బోరిగాం

మామడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని రాళ్ల బోరిగాంలో మే 12న దళితులపై జరిగిన దాడిని నిరసిస్తూ మే 30న ఛలో రాళ్ల బోరిగాం కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు.

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన

దిలావర్‌పూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం గురువారం న్యూ లోలంలో అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఈ ప్లాంట్ నిర్మాణం కోసం రూ. 64 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు జడ్పీ సీఈవో సుధీర్‌బాబు, డీపీవో శ్రీనివాస్‌లు న్యూలోలంలో స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందుల మహేష్, తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాల నిరోధానికి ముమ్మర తనిఖీలు

భైంసా, మే 29 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో నకిలీ విత్తనాల నిరోధానికి అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు చేపట్టింది. గురువారం వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందాలు పట్టణ పరిధిలోని విత్తన విక్రయ కేంద్రాల్లో జోరుగా తనిఖీలు చేపట్టింది.

ఎంఎస్పీ ధర పెంపుతో

కేంద్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని నిరూపితమైంది

● బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ● పంటలకు మద్దతు ధర పెంపుపై ఖానాపూర్‌లో బీజేపీ సంబరాలు ● మోదీ ప్లెక్సీకి క్షీరాభిషేకం

ఖానాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రధానంగా పండించే 14 రకాల పంటలకు ఎంఎస్పీ ధర పెంపుతో కేంద్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని మరోసారి నిరూపితమైందని బీజేపీ నిర్మల్ జిల్లా రితేష్ రాథోడ్ అన్నారు. ఎంఎస్పీ ధర పెంపుతో గురువారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో నిర్వహించిన సంబరాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ ప్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం రితేష్ రాథోడ్ మాట్లాడుతూ... వరి, జొన్న, సజ్జ, రాగులు, మొక్కజొన్న, కందులు, పెసర్లు, మినుములు, వేరుశనగ, సోయాబీన్, పొద్దు తిరుగుడు, కుసుమలు, ఒలిసెలు, పత్తి పంటలపై ప్రభుత్వం కనీస మద్దతు ధర పెంచడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతన్నకు మద్దతుగా నిలవడంలో బీజేపీ ఎప్పుడు ముందుంటుందని రితేష్ స్పష్టం చేశారు. ఎంఎస్పీ అమలు ఖచ్చితంగా జరగాలంటే రైతన్నలు సైతం బీజేపీ పక్షాన ఉండాలని ఆయన పిలుపునిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ అంక ం మహేందర్, మండలాధ్యక్షులు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్ కుమార్, అసెంబ్లీ కోకన్వీనర్ నల్ల రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కొండవేణి రమేష్, కంతి లింబాద్రి, బీజేపీ నాయకులు జి.కిషన్‌రెడ్డి, పిట్టల భూమన్న, చిలుకూరి తిరుమలగిరి, ఇనుముల స్వామి, మక్కల భీమన్న, కలేరి రాజేందర్, ఉప్పాల పవన్, బక్కశెట్టి వెంకట్రాములు, దాడిశెట్టి కృష్ణ, మదిరే శ్రీను, అనిల్‌రావు, పన్నెల సురేష్, ఆసం సాయికృష్ణ, అన్నపెన్న రాజశేఖర్, కోమటి రాజేశ్వర్, కొండ సురేష్, కత్తుల శ్రీకాంత్, బి. సుమంత్, పంబాల ప్రశాంత్, దుర్గి అంజయ్, ఎడ్ల రాజేశ్వర్, దుర్గం పరమేశ్వర్ గౌడ్, బర్మ వంశీ, ఐనవేణి సాగర్, మహేష్, రాజేందర్, శివ, మహేందర్, మధు, తదితరులున్నారు.



ఖానాపూర్‌లో ప్రధాని మోదీ ప్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

మాతృమూర్తులందరూ జీజాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

● విశ్వ మాంగల్యసభ దక్షిణ భారత ఇన్‌చార్జ్ గాయత్రి



భైంసా సమావేశంలో మాట్లాడుతున్న విశ్వ మాంగల్య సభ దక్షిణ భారత ఇన్‌చార్జ్ గాయత్రి

భైంసా, మే 29 (ఆంధ్రజ్యోతి): మాతృమూర్తులందరూ మార్గదర్శకమూర్తి జీజాబాయిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని విశ్వమాంగల్య సభ దక్షిణ భారత ఇన్‌చార్జ్ గాయత్రి లోమ్టే అన్నారు. గురువారం భైంసాలో పర్యటించిన సందర్భంగా స్థానిక మాతృమూర్తులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. విశ్వ మాంగల్యసభ ఆధ్వర్యంలో మహిళలకు సనాతమైన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రాశస్త్యాన్ని తెలియజేపుతు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆధునిక పోకడలు పాశ్చాత్య ధోరణి విధానాలను అవలంభించడం మూలంగా జరుగుతున్న అనర్థాలను వివరిస్తున్నామన్నారు. సాంస్కృతి, సంప్రదాయాల పాటింపుతో కలిగే ప్రయోజనాలను తెలియజేపుతున్నామన్నారు. మాతృత్వ భావనను చైతన్యం కలిగిచేందుకే గాను ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా మాతృ నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. విశ్వ మాంగల్య సభ ఆధ్వర్యంలో మహిళలకు ధ్యానం, ప్రాణాయామం, యోగా, శ్లోకాలు నేర్పించడం జరుగుతుందన్నారు. మహిళల్లో దేశభక్తిని పెంపొందిప చేయడం, విద్యార్థి దశ నుంచే బాలికలకు మాతృత్వంపై సంపూర్ణ అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. జీజాబాయి, ఝాన్సీరాణి, అహల్యబాయి హోల్కర్, పూలే సావిత్రిబాయిలాంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు.



నిర్మల్‌లో మహిళలతో సంఘటనా ప్రచారక్

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేణి, బీజేపీ మండల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, పట్టణ అధ్యక్షులు రావుల రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేష్, మాజీ కౌన్సిలర్లు సువర్ణ పోశెట్టి, గౌతం పింగ్లే, సాహెబ్‌రావ్, నాయకులు కాసరోల్ల ప్రవీణ్, అనిల్, తదితరులున్నారు.

విశ్వ మాంగళ్య ట్రస్ట్ ద్వారా మహిళా చైతన్యం

నిర్మల్ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : విశ్వమాంగళ్య ట్రస్ట్ ద్వారా మహిళల్లో మాతృశక్తి వికాసం, సర్వతోముఖాభివృద్ధి, మాతృత్వంపై అవగాహన కల్పిస్తున్నట్టు ట్రస్ట్ సంఘటనా ప్రచారక్ మోహన్ లొంటే తెలిపారు. బుధవారం ఆర్‌కే కన్వెన్షన్‌లో మహిళలతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో శాఖలున్నాయని, 8 లక్షల సభ్యులతో 5 వేల గృహస్థులు, 17 మంది ప్రభాకరక్‌లు విశ్వమాంగళ్య ట్రస్ట్‌లో పని చేస్తున్నారని వివరించారు. మహిళలకు అవగాహన కల్పిస్తే వారి కుటుంబంలోని సంతానం సుసంస్కార వంతులుగా తీర్చిదిద్దబడతారన్నారు. క్రియాశీల సమితిని గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసి దేశం, ధర్మం, సంస్కృతి, సంప్రదాయం, చరిత్ర, తదితర అంశాలపై సభ నిర్వహిస్తామని వివరించారు. బీజేపీ మహిళా నాయకురాళ్లు ఆడెపు లలిత, అలివేలు మంగ, సాధం స్వప్న, రజిని వైద్య, అనూష, పద్మ, అశ్విని పాల్గొన్నారు.

నవీన బోధన పద్ధతులు పాటించండి

నిర్మల్ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు తమ బోధనలో మారుతున్న కాలానుగుణంగా నవీన పద్ధతులు పాటించాలని ఎస్ఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ బోచ్కర్ ఓంప్రకాష్ సూచించారు. గురువారం వృత్యంతర శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. నైపుణ్యాభివృద్ధి సాధించి విద్యాబోధన మెరుగుపర్చుకోవాలన్నారు. తెలుగుపద్యం విద్యార్థుల ఏకాగ్రతకు సృజనాత్మకతకు దోహదపడుతుందన్నారు. అవధాన ప్రక్రియ భాషకు వన్నె తెచ్చిందని తెలిపారు. ఏఎంవో నర్సయ్య, కోర్స్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్పీలు పాల్గొన్నారు.

విశ్వకర్మ భగవాన్ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న దంపతులు

నిర్మల్ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సోఫీనగర్‌లోని విశ్వకర్మ భగవాన్ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, యజ్ఞ, హోమాది కార్యక్రమాలు జరిపారు. దంపతులు పెద్దసంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నేడు తెలంగాణ ఉద్యమకారుల సమావేవం

నిర్మల్ అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోత) : నిర్మల్ తెలంగాణ ఉద్యమకారుల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక విశ్రాంతి భవనంలో నిర్వహిస్తున్నామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉద్యమకారుల ఫోరమ్ చైర్మన్ కొట్టెశేఖర్ ప్రకటనలో తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్, జిల్లా జిల్లా అధ్యక్షులు రామకృష్ణగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ కిరణ్‌రెడ్డి, పాకాల రాంచందర్‌లు విజ్ఞప్తి చేశారు.

జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

లక్ష్మణచాంద, మే 29 (ఆంధ్రజ్యోతి) : జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వసంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో జీలుగ విత్తనాల పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ జీలుగ వరి పంటకు పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుందని తద్వారా వరి దిగుబడులు పెరుగుతాయన్నారు. రూ. 4,275 విలువ గల 30 కేజీల బస్తాను 50 శాతం సబ్సిడీ పోను రూ. 2,137.5కు విక్రయిస్తున్నామన్నారు. ఆసక్తి గల రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో ఉదయ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, ఏఈవోలు పవిత్ర, సుష్మిత, నాయకులు శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు

ముథోల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారికే పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో గురువారం జీఎం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముథోల్, బాసర, తానూర్, మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముథోల్, తానూర్, బాసర మండలాల బ్లాక్ కాంగ్రెస్ కమిటీ, మండల అధ్యక్షుల కోసం కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముథోల్, బాసర, తానూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, ఎం.రమేష్, మురళి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ముత్యంరెడ్డి, శంకర్ చంద్రే, నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పటేల్, రావుల శ్రీనివాస్, చంద్రకాంత్ యాదవ్ ఆయా మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలపై రైతులకు అవగాహన

సోన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ రుణాలపై, రైతు నేస్తం గురించి గ్రామస్థులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్ ప్రాసెసింగ్ ఆఫీసర్ గీత మాట్లాడారు.

రాష్ట్రానికి రానున్న నలుగురు కొత్త ఐఏఎస్‌లు

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): 'సివిల్ సర్వీసెస్ పరీక్ష-2024' ద్వారా ఎంపికైన నలుగురు కొత్త ఐఏఎస్ అధికారులు రాష్ట్రానికి రానున్నారు. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి మొత్తం 180 మంది ఐఏఎస్‌లను ఆయా రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీవోపీటీ) వెల్లడించింది. రాష్ట్రానికి రానున్న నలుగురిలో ఇద్దరు సొంత రాష్ట్రం తెలంగాణకు చెందిన వారు కాగా... మిగతా ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందినవారని తెలిపింది. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందినవారు కాగా, మరో ఇద్దరు ఇతర వెనుకబడిన వర్గాల(ఓబీసీ)కు చెందినవారు ఉంటారని డీవోపీటీ పేర్కొంది.

విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలి

▸▸ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేయనున్న ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఆ వర్గానికి చెందిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు మందుల సామ్యూల్, కవ్వంపల్లి సత్యానారాయణ, అడ్లూరి లక్ష్మణ్, తోట లక్ష్మీకాంతరావు మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఇప్పుడు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు చెప్పాలని ఢిల్లీకి వచ్చామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 60 లక్షలు వరకు ఉన్న తమకు క్యాబినేట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని చెప్పారు.

మంత్రిపై అసభ్య పోస్టు .. బీఆర్ఎస్ నేత అరెస్ట్

కాటారం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబుపై సోషల్‌మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టిన కాటారం బీఆర్ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉన్న శ్రావణ్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు తెలిపారు. మరోవైపు శ్రావణ్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు బెయిల్ మంజూరు చేసిందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

▸▸ భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 80 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని ఇందులో ఆర్థిక ఇబ్బందుల కారణంగా 60 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలిసిన తెలంగాణ కేడర్‌కు కేటాయించిన 2024 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

రేపే మిస్ వరల్డ్-2025 ఫైనల్

హైటెక్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా వేదిక .. మల్టీ మీడియా చాలెంజ్‌లో విజేతలుగా నలుగురు

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రపంచ అందాల పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం మిస్ వరల్డ్-2025 ఫైనల్ కోసం నగరం సిద్ధమైంది. సాయంత్రం 6 గంటల నుంచి హైటెక్స్‌లో జరగనున్న ఈ పోటీల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. విదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక డిజైనర్లు ప్రధాన వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. శనివారం వేడుకల్లో భాగంగా.. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండేజ్, ఇషాన్ ఖట్టర్‌తో పాటు పలువురు నటులు నృత్యప్రదర్శన ఇవ్వనున్నారు. ఫైనల్ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ప్రముఖ నటుడు సోనూ సూద్, మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి, 2017 మిస్ వరల్డ్ విజేత మానుషి చిల్లర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. కాగా.. ఏటా మిస్ వరల్డ్ ఫైనల్లో ఇచ్చే మానవతావాది (హ్యూమానిటేరియన్) పురస్కారాన్ని ఈసారి సోనూసూద్‌కు ఇవ్వనున్నారు. అలాగే రెండు రోజుల క్రితం నిర్వహించిన 'మల్టీమీడియా చాలెంజ్' విజేతలను మిస్ వరల్డ్ సంస్థ గురువారం రాత్రి ప్రకటించింది. ఇందులో నాలుగు ఖండాల నుంచి నలుగురు విజేతలున్నారు. ఏషియా-ఓషియానా నుంచి థాయ్‌లాండ్, యూరప్ నుంచి మాంటేనెగ్రో, ఆఫ్రికా నుంచి కామెరూన్, అమెరికా-కరేబియన్ నుంచి డొమినికన్ రిపబ్లిక్ దేశాల ప్రతినిధులు ఇందులో విజేతలుగా నిలిచారు. దీంతో ఫైనల్‌లో టాప్-40లో వీరి స్థానం ఖరారైంది.



'మల్టీమీడియా చాలెంజ్' విజేతలు మిస్ థాయ్‌లాండ్, మిస్ కామెరూన్, మిస్ డోమినికన్ రిపబ్లిక్, మిస్ మాంటెనెగ్రో

'మిస్ వరల్డ్'కు రూ.300 కోట్లా..?

▸▸ మహిళా హక్కుల ఉద్యమకారుల ధ్వజం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర పైసల్లేవ్.. కానీ, మిస్ వరల్డ్ అందాల పోటీలకు మాత్రం రూ.300 కోట్లు ఖర్చుపెడతారా?'అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మహిళా హక్కుల ఉద్యమకారులు మండిపడ్డారు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్ వరల్డ్ పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీకి ఆయా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. శనివారం జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలేను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పదోవంతు డిగ్రీ కాలేజీల్లో సున్నా ప్రవేశాలు

ఒక్కరూ చేరని కాలేజీలు 74 .. 60,436 మందికి ప్రవేశాలు ఖరారు..దోస్త్ తొలి విడత జాబితా విడుదల



హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదోవంతు డిగ్రీ కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన దోస్త్-2025 తొలి విడత అడ్మిషన్లలో రాష్ట్రంలోని 805 కాలేజీల్లో 74 కాలేజీల్లో ఒక్కరూ అడ్మిషన్‌కు వెబ్ ఆప్షన్ ఇవ్వలేదు. అందులో రాజన్న-సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా ఉంది. గతేడాది మాదిరే ఈసారి యూజీ డిగ్రీలో 36శాతం (21,758 మంది) కామర్స్ కోర్సులు ఎంచుకోగా, తర్వాతి స్థానాల్లో ఫిజికల్ సైన్సెస్ 15,249 మంది, లైఫ్ సైన్సెస్ 11,005 మంది, ఆర్ట్స్ 5,986 మంది, ఇతర కోర్సులు 6,438 మంది ఎంచుకున్నారు. 58,575 మంది ఇంగ్లీష్ మాధ్యమం, 1,552 మంది తెలుగు, 309 మంది హిందీ మాధ్యమం ఎంచుకున్నారు. తొలి జాబితాలో సీట్లు విద్యార్థినులే అధికసీట్లు పొందారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో 89,572 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 65,191 మంది వెబ్ ఆప్షన్లు సమర్పించారు. వారిలో 60,436 మంది సీట్లు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 805 డిగ్రీ కాలేజీల్లో 3,71,096 సీట్లు ఉన్నాయి. దోస్త్ తొలి విడత అడ్మిషన్ల జాబితాను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు ఈ.పురుషోత్తం, ఎస్‌కె. మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు గురువారం విడుదల చేశారు. తొలి జాబితాలో సీట్లు లభించిన వారు ఈ నెల 30 నుంచి జూన్ ఆరో తేదీ వరకూ నిర్దిష్ట ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, లేకపోతే సీటు రద్దవుతుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి జూన్ 9వరకూ దోస్త్ రెండో విడత దరఖాస్తులను స్వీకరిస్తామని, 13న సీట్లు కేటాయిస్తామన్నారు.

సీట్ల భర్తీలో నిజాం కాలేజీ టాప్

హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ 1,197 సీట్లకు 1,170 (97.74%) సీట్ల భర్తీతో మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో కోఠి మహిళా కాలేజీ (వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం)లో 93.19%, మూడో స్థానంలో ఉన్న సిటీ కాలేజీలో 88.89, బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 82.69, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 80.98, నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రాం డిగ్రీ కాలేజీలో 80.29, కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కాలేజీలో 73.01, నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కాలేజీలో 68.56, హన్మకొండలోని యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో 66.1, నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీలో 65.75% సీట్లు భర్తీ అయ్యాయి. ఈసారి దోస్త్‌లో 10 మంది టాప్ ర్యాంకర్లలో నలుగురు కోఠి మహిళా కాలేజీని ఎంచుకున్నారు. వారిలో ముగ్గురు ఫిజికల్ సైన్సెస్, ఒకరు లైఫ్ సైన్స్ సబ్జెక్ట్ ఆప్ట్ చేసుకున్నారు. ఇంటర్‌లో 99.60% మార్కులతో దోస్త్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు పొందిన వసంత్ కుమార్, 99.40% మార్కులతో ఎనిమిదో ర్యాంకు పొందిన బెక్కరి అక్షిత కూడా నిజాం కాలేజీలో కామర్స్ విభాగంలో సీటు పొందారు.

75% హాజరుతోనే ఫీజు రీయింబర్స్‌మెంట్

డిగ్రీ కోర్సుల్లో కనీసం 75% తరగతులకు హాజరైన విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని గురువారం జరిగిన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మరోవైపు, మూడేళ్ల డిగ్రీ కోర్సులో ఆరు సెమిస్టర్లలో ప్రతి సెమిస్టర్‌కు 25 క్రెడిట్స్ చొప్పున 150 క్రెడిట్స్ ఉండగా, వాటిని 142కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చివరి సంవత్సరం రెండు సెమిస్టర్లలో ఒక మైనర్ సబ్జెక్ట్, ప్రథమ/ద్వితీయభాషలకు కలిపి 15 చొప్పున 30 క్రెడిట్స్ తొలగించారు. ఐదో సెమిస్టర్‌లో మల్టీ డిసిప్లినరీ కోర్సు 4, అదనంగా నేర్చుకునే ఇతర కోర్సులకు 7 క్రెడిట్స్, చివరి సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌కు 4, ఇతర అదనపు కోర్సులకు 7 క్రెడిట్స్ కేటాయించారు. చివరి రెండు సెమిస్టర్లలో విద్యార్థులు రెండు ప్రధాన సబ్జెక్టులపై దృష్టి సారించాలని, ఇంటర్న్‌షిప్‌తోపాటు అదనపు కోర్సులు నేర్చుకోవాలన్న లక్ష్యంతో కొత్త క్రెడిట్స్ విధానం రూపొందించామని బాలకిష్టారెడ్డి తెలిపారు.

భవనంపై నుంచి దూకి బీఆర్ఎస్ నేత ఆత్మహత్య

మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ వేధింపుల వల్లేనంటూ బంధువుల ఆందోళన

బోరబండ ప్రాంతంలో ఉద్రిక్తత



ఎండీ సర్దార్ (ఫైల్)

బోరబండ, మే 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సర్దార్ (33) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులే సర్దార్ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన బంధువులు గురువారం ఆందోళనకు దిగారు. దీనితో బోరబండ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎండీ సర్దార్ ఎస్ఆర్‌టీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి తన ఇంటి నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ బంధువులు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బోరబండ ప్రాంతంలో, ఫసియుద్దీన్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్దార్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఫసియుద్దీన్, ఆయన భార్య హబీబాషేక్, పీఏ సప్తగిరితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన సోదరుడు ఇటీవల ఇంటి ఆధునీకరణ పనులు చేపట్టారని.. దీనితో డబ్బులు డిమాండ్ చేస్తూ వారు వేధించారని ఇబ్రహీం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సర్దార్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కదిలి పాప హరేశ్వర స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి



కదిలిలో పూజలు చేస్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీవాణి

దిలావర్‌పూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పురాతన శైవ క్షేత్రం శ్రీ కదిలి పాప హరేశ్వర స్వామిని జిల్లా న్యాయాధికారి ఎస్. శ్రీవాణి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భం గా అర్చకులు ఆలయ సాంప్రదాయ రీతిలో న్యాయమూర్తికి స్వాగతం పలికారు. న్యాయాధికారి శ్రీవాణి పాప హరేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం మాత అన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకుని కుంకుమార్చన పూజలు చేశారు. కదిలి పాప హరేశ్వర స్వామి ఆలయ ప్రాశస్త్యాన్ని ఆలయ అర్చకులను అడిగి తెలుసుకున్నా రు. అనంతరం దేవస్థానం ఈవో భూమయ్య, దేవస్థానం చైర్మన్ వెంకట్రావు పటేల్, ప్రధాన అర్చకులు పంచాక్షరి, శంకర్ న్యాయమూర్తిని సత్కరించారు. నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, దిలావర్‌పూర్ ఎస్సై లోక సందీప్ ఉన్నారు.

కుభీర్ మార్కెట్ యార్డు వెలవెల



రైతులు లేక వెలవెలబోయిన కుభీర్ మార్కెట్ యార్డు

కుభీర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24న ప్రభుత్వం ప్రారంభించిన జొన్నల కొనుగోళ్లు బుధవారం రాత్రి ముగిశాయి. నిన్న మొన్నటి వరకు జొన్నల క్రయ విక్రయాలతో కళకళలాడిని యార్డు ప్రస్తుతం బోసి పోయింది. రైతుల దూరభా రాన్ని తగ్గించేందుకు మండలంలోని చాత గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఎకరానికి 14 క్వింటాళ్లుగా మొత్తం 98 మంది రైతుల నుండి 2475 క్వింటాళ్ల కొనుగోలు చేశారు. ఈ మొత్తం కొనుగోళ్ల ద్వారా రూ. 12కోట్ల 33 లక్షల 88 వేల 713 రూపాయలు సంబంధిత రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నట్లు పీఏసీఎస్ సీఈవో కాంత్రి కుమార్ తెలిపారు.

నిర్వాహకుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం!



రైస్ మిల్ పేరు లేని ట్రక్ షీట్ ఇచ్చిన అధికారులు



తురాటి ఎక్స్ రోడ్ వద్ద వాపస్ వచ్చిన ట్రాక్టర్ల వద్ద బ్యాగులు అన్‌లోడ్ చేస్తున్న రైతులు

నర్సాపూర్(జి), మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డొంగుర్‌గాం గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసిన వరి ధాన్యం రైస్‌మిల్లు యజమానులు వాపస్ పంపారు. తురాటి గ్రామ రైతు గొర్ల ప్రవీణ్ కు చెందిన వరి ధాన్యం 1100ల బస్తాలను ఒక లారీ, నాలుగు ట్రాక్టర్లలో తూకం వేసి కుంటాల, మామడ రైస్ మిల్లులకు పంపారు. సెంటర్ నుండి పంపిన వరి ధాన్యం బస్తాలు ఏ రైస్ మిల్లుకు వెళ్లాలో ట్రక్ షీట్ రైస్ మిల్లు పేరు, వాహనం నెంబర్లు వేయకుండానే అధికారులు పంపడంపై రైతులు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్యం కారణంగా తేమ శాతం సాకుతో ట్రాక్టర్లు వాపస్ రావడంతో రైతు తురాటి బస్టాప్ వద్ద నాలుగు ట్రాక్టర్లలో ఉన్న గన్ని బ్యాగుల నుంచి వడ్లు అన్‌లోడ్ చేసి టార్పాలిన్‌లో ఆర బెట్టాడు. ఏదిఏమైనా రైతులకు అధికారులు పర్యవేక్షించి ఏ రైస్ మిల్లులకు పంపాలో ట్రక్ షీట్ ఇస్తే బాగుండేదంటున్నారు. తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నా మిల్లు యజమానులు వాపస్ పంపడంపై సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ మొదట కుంటాల రైస్ మిల్, మళ్లీ మాటేగాం రైస్‌మిల్, చివరగా భైంసా రైస్ మిల్లుకు వెళ్లి వరి బ్యాగులు వాపస్ రావడంతో ఖర్చులు ఎక్కువ అయ్యాయని, 15 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పంట పండిస్తే పంట పండిన తర్వాత కౌలు రైతులకు ఎకరాకు 10,000లు ఎలా ఇవ్వాలో అర్థం కావట్లేదని అన్నారు.

'కుమురం భీం చౌక్‌ను కుదించడం సరికాదు'



నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

ఆదిలాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కుమురం భీం చౌక్‌లో ఏర్పాటు చేసిన సర్కిల్‌ను ఆదివాసులతో చర్చించకుండానే కుదిస్తున్నారని, చౌక్‌ను కుదించడం భీమ్‌ను అవమానించడమేనని ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్‌తో ట్రాఫిక్ సమస్య ఏర్పడి రోడ్డు ప్ర మాదాలు సంభవిస్తున్నాయనే నేపంతోని సర్కిల్‌ను చిన్నగా చేయాలని ఆదిలాబాద్ మున్సిపాలిటీ అధికారులు అక్కడున్న సర్కిల్‌ను కుదిస్తున్నారన్నారు. ఇది హేయమైన చర్యగా ఆదివాసీ సంఘాలు భావిస్తున్నాయన్నారు. ఆదివాసీ సంఘాలతో కావచ్చు, రాయి సెంటర్‌తో కావచ్చు ఎలాంటి సంప్రదింపులు చేయకుండా ఆదివాసులను అడగకుండా కుమురం భీం చౌక్‌లోని సర్కిల్‌ను కుదించడం సరైన చర్య కాదన్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో సర్కిల్ చిన్నగా ఉన్న ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్న ప్రభుత్వం, మున్సిపాలిటీ అధికారులు ఆదివాసీ అమరవీరుడు కొమురం భీం చౌక్‌లో ఉన్న సర్కిల్‌ను కుదించడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఆదిలాబాద్ మున్సిపాలిటీ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కొమురం భీం చౌక్‌లోని సర్కిల్‌ను అలాగే ఉంచి ఆదివాసీ సంఘాల నాయకులతో, రాయి సెంటర్ నాయకులతో చర్చించాల్సిందిగా ఆదివాసీ సంఘాల తరఫున డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా బంద్‌కు పిలుపునివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేష్, ఏబీఎం రాష్ట్ర నాయకులు కుల్‌గ యాదవ్ రావు, కొల్లం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోడప సోనేరావు, కుమ్ర శ్రీనివాస్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వేట్టి మనోజ, మాజీ ఎంపీటీసీ మండల పరి షత్ ఉపాధ్యక్షులు కుమ్ర జగు, చించుఘాట్ గ్రామ పటేల్ కుమ్ర రాజు పటేల్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరు ణ్, ఎస్‌టీ సేల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సకోలా అశోక్, పీడీ ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ పాల్గొన్నారు.

గండి రామన్న దత్త సాయి ఆలయంలో సామూహిక దత్త అనఘా వ్రతం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు

నిర్మల్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గండి రామన్న దత్త సాయి ఆలయంలో సామూహిక శ్రీ దత్త అనఘా వ్రతం నిర్వహించినట్లు సాయి దీక్ష సేవ సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. అవధూత దత్త పీఠాధిపతి జగద్గురు పరమ పూజ శ్రీశ్రీశ్రీ గణపతి స్వామివారి దివ్య ఆశీస్సులతో గురువారం గండి రామన్న దత్తసాయి ఆలయంలో సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక శ్రీ దత్త అనఘా వ్రతం అంగరంగ వైభవంగా 108 జంటలతో నిర్వహించడం జరిగింది. తర్వాత అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, పూదరి నరహరి, నారాయణ రెడ్డి, జైపాల్ రెడ్డి, సోమేశ్వర్, కోల శంకర్, శశిధర్, రమేష్ రావు, మల్లారెడ్డి, జనార్ధన్, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వేణుగోపాల శర్మ కరీంనగర్ వారిచే నిర్వహించడం జరిగిందని తెలిపారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ఇంద్రవెల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్టాపన వైభవంగా నిర్వహించారు. గురువారం మండలంలోని దస్నాపూర్ గ్రామంలో నూతన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం, ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠాపన సందర్భంగా రెండు రోజుల పాటు ప్రత్యేక ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ కలశంతో శోభాయాత్ర నిర్వహించి ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్టాపన చేశారు. అనంతరం భక్తులకు ఉద్దేశించి బాలు మహారాజ్ మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతీ ఒక్కరు ఏదో ఒక రకంగా ఒత్తిడికి గురవుతున్నారని, దైవ చింతన అలవర్చుకోవాలని, దీనిద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామంలోని పెద్దల సహకారంతో విరాళాలు సేకరించి ఆలయాన్ని నిర్మించనట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పొటులే పుండలిక్, గ్రామస్తులు జవాదే కేశవ్, కరాడే మారుతి, పోటే సాయినాథ్, నాందేవ్, సంతోష్, ప్రకాష్, గజానంద్ పాల్గొన్నారు.



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న బాలు మహారాజ్



నవ వధువును సాగనంపుతున్న గ్రామస్తులు

ఎడ్ల బండిపై నవ వధువు


● ఇప్పటికీ పాటిస్తున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు

ఇంద్రవెల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా, ఆచారాలను భావితరాలకు అందించడంలో ఆదివాసీ గిరిజనులకు ఒక ప్రత్యేకత ఉంది. ఆచారాలు, అలవాట్లు, పెళ్లిళ్లు, పండుగలు అన్నీ ప్రత్యే కమే. ఆదివాసీ గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతున్న తరుణంలో ఇప్పటికీ కొన్ని ఆదివాసీ గిరిజన గూడేల్లో పాత పద్ధతిలో ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పాటిస్తున్నారు. గురువారం మండలంలోని డోంగర్ గావ్ గ్రామంలో ఆదివాసీలు త మ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రకారం పుట్టింటి ఇంటి నుంచి పెళ్లి కూతురిని ఎడ్ల బండి పైన కూర్చో పెట్టుకుని ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల వాయిస్తూ గ్రామస్థులంతా కలిసి నవ వధువు తన అత్తమామ ఇంటికి సాగనంపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పెందోర్ బాదు, కోవా ఇస్తు, పెందోర్ రాము, పెందోర్ శంకర్, నైతం జంగు, తదితరులు పాల్గొన్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్‌లు

బోథ్, మే 29 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూన్ 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్‌లు అమలులోకి వస్తాయని ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ వివేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 24 స్లాట్లు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 24 స్లాట్లు మొత్తం మీద రోజుకు 48 స్లాట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. బుకింగ్ చేసుకున్న వారికి త్వరలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు.



ఫర్టిలైజర్ దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న సోయా విత్తన బస్తాలు..

అన్నదాతకు విత్తన కష్టాలు!

- సోయా విత్తనాల కోసం మహారాష్ట్రకు పరుగులు
- ధరల్లో భారీగా తేడాలతో పొరుగు రాష్ట్రం విత్తనం వైపే జిల్లా రైతుల మొగ్గు
- విత్తన నాణ్యతపై తలెత్తుతున్న అనుమానాలు
- ధరల నియంత్రణపై దృష్టి సారించని అధికార యంత్రాంగం

ఆదిలాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా పండించే పత్తి పంట తర్వాత రైతులు అధికంగా సోయా పంటను సాగు చేస్తారు. ఈ యేడు వానాకాల సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 62 ,500 ఎకరాలలో సోయా పంట సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో 18725.7 క్వింటాళ్ల సోయా విత్తనాలు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. అయితే పొరుగు రాష్ట్రం మహారాష్ట్రతో పోల్చుకుంటే జిల్లాలో అందుబాటులో ఉన్న మాళవిక, విక్రం తేజస్విని తదితర సోయా విత్తన ధరల్లో భారీ తేడాలు కనిపిస్తున్నయని రైతులు వాపోతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే సోయా పంట విస్తీర్ణం భారీగా పెరుగుతూ వస్తుంది. అలాగే చీడపీడల బెడద కూడా తక్కువగానే ఉండడంతో ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వర్షాధారంగా పండించే సోయా అన్ని రకాల నేలలు, జిల్లా వాతావరణ పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడులు రావడంతో ఈ పంట వైపే జిల్లా రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదునుగా వ్యాపారాలు డిమాండ్ ఉన్న సోయరకం విత్తనాలను అధిక ధరలకు అమ్మేస్తూ దుండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ధరల నియంత్రణపై అధికార యంత్రాంగం, వ్యవసాయ శాఖ అధికారులు అసలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

పొరుగు విత్తనంపై మోజు..

ఈసారి జిల్లా రైతులకు పొరుగు విత్తనాలపై మోజు ఎక్కువగా కనిపిస్తుంది. స్థానికంగా కొనుగోలు చేసిన సోయా విత్తనాలు గతంలో సరిగా మొలకెత్తక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. దీంతో విత్తనాల కొనుగోలులో రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. జిల్లా వ్యాపారాలు, అధికారులపై నమ్మకం లేకపోవడంతో పొరుగున ఉన్న మహారాష్ట్రకు పరుగులు తీస్తున్నారు. పెద్ద మొత్తంలో సోయ విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. మహారాష్ట్రలోని సార్కనీ, కిన్వట్, బోరి, పాంఢ్ర కొడా, కొరుపాన, చంద్రపూర్ ప్రాంతాల నుంచి విత్తనాలను భారీగా కొనుగోలు చేస్తున్నారు. అయితే రవాణా భారం అధికం కావడంతో నలుగురు, ఐదుగురు రైతులు కలిసి టోకున విత్తనాలను తీసుకొచ్చుకుంటున్నారు.

డిమాండ్‌ను బట్టి ధరలు..

జిల్లాలో విత్తనాల డిమాండ్‌ను బట్టి వ్యాపారాలు ధరలను నిర్ణయిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తరచూ విత్తన ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. మహారాష్ట్రతో పోల్చుకుంటే జిల్లాలో సోయా విత్తన ధరల్లో భారీ తేడా కనిపిస్తుంది. ఉదాహరణకు.. మాళవిక సోయా విత్తన బ్యాగు మహా రాష్ట్రలో రూ.2700 ఉండగా జిల్లాలో మాత్రం రూ.2800 ధర పలుకుతుంది. అలాగే సోనం తేజస్విని సోయా విత్తన బ్యాగు మహారాష్ట్రలో రూ.2950 కాగా ఇదే విత్తన బ్యాగు జిల్లాలో రూ.3400 ధర ఉంది. ఇలా అన్ని రకాల కంపెనీల సోయా విత్తన ధరల్లో భారీ తేడా కనిపిస్తుంది. ఒక్కో రైతు పది ఎకరాలు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలోనే సోయా పంటను సాగు చేస్తారు. దీంతో ధరల్లో భారీ తేడాలు ఉండడంతో నష్టపోవాల్సి వస్తుందని అన్నదాతలు వాపోతున్నారు.

మొలక శాతంపై అనుమానాలు..

పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి జిల్లా రైతులు సోయా విత్తనాలను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఒకవేళ ఆశించిన స్థాయిలో మొలక శాతం రాకపోతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతన్నాయి. జిల్లా రైతుల డిమాండ్‌ను బట్టి అక్కడి వ్యాపారాలు నకిలీ విత్తనాలను అంటగట్టే అవకాశం కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితి ఎదురైతే బాధ్యులు ఎవరన్నా వాదనలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు నిఘా సారించకపోవడంతో మహారాష్ట్ర నుంచి అడ్డగోలుగా ఎరువులు, విత్తనాలు జిల్లాలోకి సరఫరా అవుతున్నాయి. అసలు ఏవి నకిలీ, ఏవి అసలు విత్తనాలో తెలుసుకోకుండానే రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసిన తెలియనట్లుగానే వ్యవహరిసున్నారు. కనీసం రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకైనా ముందుకు రావడం లేదంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం...

: శివకుమార్ (ఏడీఏ అదిలాబాద్)

సోయా విత్తన ధరల్లో తేడాలు ఉన్నట్లు ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం దాదాపుగా దేశవ్యాప్తంగా విత్తన ధరలు ఒకే రకంగా ఉంటాయి. మహారాష్ట్రతో పోల్చుకుంటే కొన్ని రకాల సోయా విత్తన ధరలు జిల్లాలో అధికంగా ఉన్నట్లు తెలిసింది. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పనిసరిగా రసీదును కలిగి ఉండాలి.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్



ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్

ఇంద్రవెల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ధన్నోర్ (బీ), ముత్నూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణంలో సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ దుకాణంలోని విత్తనాలు, ఎరువుల స్టాక్‌తో పాటు రైతులకు విక్రయిస్తున్న తీరు, లైసెన్స్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. విత్తన, ఎరువు రైతులకు అమ్మేటప్పుడు ప్రతి రైతుకు కచ్చితంగా రసీదు ఇవ్వాలన్నారు. రైతులకు ఇచ్చే రసీదులో విత్తనాలకు సంబంధించిన వివరాలన్నీ రాసి రైతు సంతకం తీసుకొని విత్తనాలు ఇవ్వాలని తెలిపారు. విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుల మందులు సమగ్ర వివరాలను రిజిస్టర్‌లో రోజువారీగా నమోదు చేయాలని తెలిపారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్, ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్ రావు తదితరులున్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



విత్తన బ్యాగులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

నేరడిగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు నకిలీ విత్తనాలు రవాణా చేస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల విత్తనాలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను, విత్తన పాకెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. జిల్లాలో పత్తి, సోయా ఇతర ఉద్యాన, వాణిజ్యపంటలు పండించేందుకు అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు కల్తీ విత్తనాలు అంటగట్టేవారిపై నిఘా ఉంచడం జరిగిందని రైతులు అనుమతి ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలని, లూజ్‌విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనవద్దని సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. పోలీసుల సహకారం తీసుకుని దాడులు చేయడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి, ఏఈఓలున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- మావల సమీపంలో ఘటన



వివరాలు 6వ పేజీలో...

కుమురం భీంచౌక్‌ను కుదించడం సరికాదు



వివరాలు 7వ పేజీలో...

నిర్వాహకుల నిర్లక్ష్యం రైతులకు శాపం!



వివరాలు 7వ పేజీలో...

రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలి

- కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డా.రాజశేఖర్



పంటల నివారణ చర్యలు వివరిస్తున్న డా.రాజశేఖర్

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, మే29 (ఆంధ్ర జ్యోతి) : రైతులు తమ పంటలకు రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడుతూ.. పెట్టుబడి ఖర్చులను క్రమేణ తగ్గించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డా.రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని దరంపూరి గ్రామంలో కృషివిజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలను 60నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యాకే విత్తుకోవాలన్నారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, కాయకుళ్లు, సోయాబీన్ పంటలో కాండపు ఈగ, పెంకు పురుగు నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. వాతావరణ మార్పులకనుగుణంగా.. పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీసాది, ఏఈఓలు, వెటర్నరీ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

డీపీవోకు సన్మానం



డీపీవోను సన్మానిస్తున్న ఎంపీడీవో, గ్రామ కార్యదర్శులు

బోథ్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన జి.రమేష్ గురువారం బోథ్ ఎంపీడీవో కార్యాల యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీడీవో రమేష్ సన్మానించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి గ్రామాలలో పారిశుధ్యం పరిరక్షణకు తమ చర్యలు తీసుకుం టున్నామన్నారు. అయితే రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న కొన్ని దరఖాస్తులను ఆయా బ్యాంకుల వారు తిరస్కరించార న్నారు. సిబిల్ స్కోర్ తక్కువగా ఉండడంతో పాటు బ్యాంకులు తిరస్కరించే అన్నారు. ఎస్బిఐ బ్యాంక్ వారు 116 యుబిఐ 52 టీజీబి 76 ఏడిసిసి 3 దరఖాస్తులను తిరస్కరించిందన్నారు. అంతేగాక గ్రామాల కార్యదర్శులు వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ఆదిలాబాద్ డీఈవో శ్రీనివాస్‌రెడ్డి



జీపుజాత జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, మే 29 (ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మౌలికవసతులు కల్పిస్తున్నా మని ఆదిలాబాద్ డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతం లక్ష్యంగా టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ జీపుజాత కార్యక్ర మాన్ని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిం చారు. కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅ తిథిగా హాజరై ప్రారంభించారు. సంఘం ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించడం అభి నందనీయమన్నారు. పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.

తలమడుగు : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని టీఎస్‌యూ టీఎఫ్ నాయకులు అన్నారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ చేర్పించి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసుకుందామని టీఎస్ యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఎన్‌రోలెమెంట్ ప్రచారజాతలో భాగంగా మండలంలోని దేవాపూర్, బరంపూర్, తలమడుగు, సుంకిడి తదితర గ్రామాల మీదుగా నిర్వహించిన జాతాలో పాల్గొన్న నాయకులు నాణ్యమైన విద్య, విద్యార్థులను సంపూర్ణమైన వ్యక్తులుగా తీర్చిదిద్దే పరిస్థితులు, అన్ని వసతులు ఉండి, ఒత్తిడి లేని చదువు కేవలం ప్రభుత్వ పాఠశాలలో ఉంటుందని వారు తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రచార జాతకు మండల కాంగ్రెస్ నాయకులు కల్యాణం రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకురాలు సునీతరెడ్డి, ఎస్ఎంసీ మాజీచైర్మన్ గంగన్నలు మద్దతుగా ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న అశోక్, జిల్లా కోశాధికారి కే శ్రీనివాస్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్, గంగా ధర్, జిల్లా నాయకులు నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట

- కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దయాకర్



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కిసాన్ మోర్చా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు దయాకర్ అన్నారు. కేంద్ర క్యాబినెట్ ఖరీఫ్‌సీజన్ పంటలకు మద్ధతు ధర గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. మద్ధతు ధర పెంపుపై గురువారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోడీ ఫ్లెక్సీకి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. రైతు సంక్షేమమే పరమావధిగా పీఎం నరేంద్ర మోడీ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చానాయకులు రవీందర్, విఠల్, కార్తీక్, నాగోరావ్, సత్యం, నారాయణ పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి : హెచ్‌ఈవో



నిల్వ నీటిని పారబోస్తున్న హెచ్‌ఈవో

నేరడిగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో వివిధ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ సూచించారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఇళ్ల ఆవరణలో ఉన్న మురుగు నీటిని శుభ్రపరిచారు. పాత్రల్లో నీటిని నిల్వ చేసి ఉంచ కూడదని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఇంటి ఆవరణలో శుభ్రత పాటించాలన్నారు. ఇందులో హెల్త్ అసిస్టెంట్‌లు సంతోష్, జగదీశ్వర్ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఆశాలు సుజాత, పుష్పలు ఉన్నారు.

తాంసి : ప్రస్తుతం వర్షాకాలమైనందున పరిసరాల పరిశుభ్రత పై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని మండల వైద్య బృందం ప్రజలకు సూచించారు. గురువారం సాయంత్రం జామిది, పొన్నారి, గ్రామాల్లో వైద్య బృందం పర్యటించింది. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. మురికి నీరు నిలువ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏవైనా వ్యాధులు సోకుతే వెంటనే ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ తులసీరామ్, లక్ష్మి, పద్మ, అరుణ ఉన్నారు.

రిమ్స్ ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు.గురువారం ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ సభ్యులకు ఫైండ్ ఇండియా సంస్థ గాలి ద్వారా సంక్రమణ వ్యాధుల నివారణపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్రమిత వ్యాధులు సోకకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి రిమ్స్‌ను ఇన్ఫెక్షన్ ఫ్రీ ఆసుపత్రిగా మార్చాలని అన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, వైద్యులు డాక్టర్ సుమలత, అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.